క్లుప్తంగా

ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్ పూర్తిగా నివారణ



చింతలపూడి ఆశ్రమంలో క్యాన్సర్‌పై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

చింతలపూడి: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని వైద్య ఆరోగ్య శాఖ ఎంఎల్ హెచ్‌పీ ఎం లావణ్య అన్నారు. స్థానిక ఆశ్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు ధేరే సమ్మ ఆధ్వర్యంలో సోమవారం 104 సిబ్బందితో కలిసి క్యాన్సర్‌పై అవగాహన కలిగించారు. క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో గుర్తించి తగిన చికిత్స అందిస్తే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. ఏఎన్ఎంలు కె కుమారి, బి ఝాన్సీ లక్ష్మి, ఆశ వర్కర్లు అన్నమ్మ, రత్నకుమారి, అశ్విని, దివ్య పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత కార్తీక్‌కు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు సోమవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. మచిలీపట్నంకు చెందిన మల్లవోలు రాజేష్ వెంకటకార్తీక్ ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం విరాళాన్ని నిత్యాన్నదాన కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

కొయ్యలగూడెం తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



కొయ్యలగూడెంలో తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరిస్తున్న సుబ్బారావు

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం తహసీల్దార్ (ఇన్‌చార్జ్)గా జేవీ సుబ్బారావు సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీటీ వెంకటలక్ష్మి కుమారి ఆధ్వర్యంలో వీఆర్వో అసోసియేషన్ సభ్యులు తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానం పలికారు. సుబ్బారావు ద్వారకాతిరుమల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తుండగా ఆయన ఇన్‌ఛార్జిగా కలెక్టర్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు తహసీల్దార్ బాధ్యతలు నిర్వహించిన కుంజా చెల్లన్నదొర ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో భాగంగా ఏలూరు కలెక్టరేట్‌కి వెళ్లారు. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం తిరిగి ఆయన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరిస్తారని ఆర్ఐ మణిదివ్య తెలిపారు. వీఆర్వో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహాగణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



జంగారెడ్డిగూడెం మార్కెట్ యార్డులో మహాగణపతి ఆలయం వద్ద సరస్వతి పూజ

జంగారెడ్డిగూడెం: స్థానిక మార్కెట్ యార్డ్‌లో సిద్ధి బుద్ధి సమేత మహాగణపతి స్వామి ఆలయంలో రాజశ్యామలా అమ్మవారి గుప్త నవరాత్రుల్లో భాగంగా, శ్రీపంచమిని పురస్కరించుకుని సరస్వతి సహిత రాజశ్యామల ఆలయంలో హోమం నిర్వహించారు. రాజరాజేశ్వరి త్రిశక్తి పీఠం, హైందవ చైతన్య సంస్కృతి సేతు సంస్థ చైర్మన్ ఆధ్వర్యంలో అర్చకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిపూజ, రుద్రాభిషేకం, సరస్వతి సహిత రాజశ్యామల అమ్మవారికి విశేష అర్చన, సరస్వతి పూజ నిర్వహించారు.

గోవులను తరలిస్తున్న వాహనాల అడ్డగింపు

జంగారెడ్డిగూడెం : గోవులను తరలిస్తున్న మూడు వ్యానులను పోలీసులు జంగారెడ్డిగూడెంలో సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన కె.సాయి అనే యువకుడు ఈ వాహనాలను గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక పోలీసులు అప్రమత్తమై బైపాస్ రోడ్డులో గోవులతో వెళ్తున్న మూడు వ్యాన్లను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ వాహనాలు విజయనగరం నుంచి వరంగల్ వెళ్తున్నట్టు తెలిసింది. ఇదిలా ఉంటే ఈ వాహనాల్లో తరలిస్తున్న రెండు గోవులు ఈనాయి. రెండు దూడలకు జన్మనిచ్చాయి. రికార్డులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ బిల్లులు పరిశీలించి సక్రమంగా ఉన్నాయని ఎస్సై షేక్ జబీర్ చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలను వదిలేసినట్టు ఎస్సై చెప్పారు.

అధ్వానంగా రహదారులు

- గిరిజన గ్రామాల్లో ప్రయాణానికి నరకయాతన
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- కనీస మరమ్మతులు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



దొరమామిడి నుంచి వీరమద్దిగూడెం రోడ్డు దుస్థితి



అధ్వానంగా ఉన్న రామన్నగూడెం రోడ్డు

బుట్టాయగూడెం: అలివేరు రహదారి అధ్వానంగా మారింది. దొరమామిడి డ్యామ్ కాలనీ నుంచి కొత్త అలివేరు వరకూ శిథిలమైన రహదారిపై ప్రయాణం చేయడానికి గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. కనీసం ద్విచక్ర వాహనాలపై కూడా ప్రయాణం చేయలేని పరిస్థితి ఉందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా దొరమామిడి నుంచి గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం వరకూ రహదారి అస్తవ్యస్థంగా మారింది. ఈ రహదారులకు కనీస మరమ్మతులను చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

రాళ్లు లేచిన రోడ్డుపై అవస్థలు పడుతున్న ప్రజలు

దొరమామిడి నుంచి వీరమద్దిగూడెం వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఈ రహదారిపై పూర్తిగా రాళ్లు పైకిలేచి ఉండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రామారావుపేట సెంటర్ నుంచి సూర్పవారిగూడెం, పడమర రేగులకుంట వెళ్లే రహదారి ఇటీవల మరమ్మతులు చేసేందుకు రోడ్డును జేసీబీతో తవ్వారు. అయితే పనులు మొదలుపెట్టి అసంపూర్తిగా వదిలివెయ్యడంతో రాళ్లు పైకి లేచి ఈ రహదారిపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఆదివారం, మంగళవారం గుబ్బల మంగమ్మ గుడికి అధిక సంఖ్యలో వాహనాలు వెళ్తూ ఉంటాయి. ఈ వాహనాలు వెళ్లే సమయంలో దుమ్ము ఎక్కువగా లేస్తుంది. అధ్వానంగా ఉన్న ఈ రహదారిపై ప్రయాణం చెయ్యలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాపవరం రోడ్డు ఛిద్రం

పందిరిమామిడిగూడెం నుంచి కామవరం వరకూ వెళ్లే రహదారి ఛిద్రమైంది. ఆదివారం గుబ్బల మంగమ్మ గుడికి అధిక సంఖ్యలో వాహనాల వెళ్లే సమయంలో దుమ్ము, ధూళి లేచి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలోని రామన్నగూడెం రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి కృషి చెయ్యాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణానికి ఇబ్బందులు



దొరమామిడి నుంచి అలివేరు వరకూ ప్రయాణం చెయ్యాలంటే నరకం చూస్తున్నాం. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడేలేడు. రహదారిపై కనీస మరమ్మతులను చేపట్టి ప్రయాణానికి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కారం వాసు, ఎర్రాయిగూడెం, బుట్టాయగూడెం మండలం

పట్టిసం ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన



అనిస్త్రీ, పునిస్త్రీ ఆలయం వద్ద పూజలు చేస్తున్న డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టిసం శివక్షేత్రం వద్ద చేపట్టే ఏర్పాట్లను డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు పరిశీలించారు. పట్టిసం రేవులో, నది దాటే ప్రదేశంలో ఏర్పాటు చేసే పంట్లు ప్రదేశాలను క్షేత్రం వద్ద భక్తులు దైవదర్శనానికి వీలుగా ఏర్పాటు చేసే క్యూలైన్లు, తదితర ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. గ్రామ పంచాయతీ, ఫెర్రీ కాంట్రాక్టర్, దేవస్థానం అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. క్షేత్రం వద్ద అనిస్త్రీ, పునిస్త్రీ ఆలయానికి సంబంధించి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. పోలవరం సీఐ సురేష్‌బాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు చేయూత



విభిన్న ప్రతిభావంతులైన చిన్నారుల కోసం సహాయాన్ని అందిస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం: వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతుల పిల్లలకు సోమవారం దాతలు చేయూతను అందించారు. ఉప్పలమెట్ట ఏరియాకు చెందిన షేక్ రషీద్ మాబుల కుమారుడు చనిపోవడంతో, విభిన్న ప్రతిభావంతులైన మనుమళ్లను సాకడానికి ఇబ్బందులు పడుతున్నారు. విభిన్న ప్రతిభావంతుల పిల్లలు అయిన అష్రఫ్, ఆరిఫ్ (నడవలేని పరిస్థితి) కష్టం చూసి చలించిన దాతలు సిద్దార్థ మైత్రేయి ఇన్ఫోటిక్ ఫౌండేషన్ చైర్మన్ అయిన పిప్పళ్ల రామకృష్ణ (చిన్ని) రూ.5వేలు, శ్రీశైలం గుర్నాథ్, నాగలక్ష్మి దంపతులు బియ్యం బస్తా, నిత్యావసర వస్తువులు అందజేశారు. కౌన్సిలర్ నంబూరు రామచంద్రరాజు చేతుల మీదుగా పిల్లలకు సహాయం అందజేశారు. నాలుగో వార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ మాట్లాడుతూ అషరఫ్, ఆరిఫ్‌కు దాతలు సాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో షేక్ హసీనా, భవిత స్కూల్ టీచర్ రజనీ, మద్దిపాటి శ్రీను, కాసగాని రామారావు, మాదేవీ అప్పన్న పాల్గొన్నారు.

షేక్ వలియాకు తెలుగు వెలుగు నంది పురస్కారం



తెలుగు వెలుగు నంది పురస్కారం అందుకుంటున్న మెజీషియన్ షేక్ వలియా

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన మెజీషియన్ తెలుగు వెలుగు నంది పురస్కారం–2025 అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంత్యుత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 2న తెలుగు వెలుగు నంది పురస్కారాల మహోత్సవం నిర్వహించారు. విజయవాడలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మ్యాజిక్, గారడీ విద్యలో విశిష్టమైన కృషి చేసినందుకు జంగారెడ్డిగూడెంకు చెందిన మెజీషియన్ షేక్ వలియా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వలియా మాట్లాడుతూ 25 ఏళ్లుగా మ్యాజిక్ రంగంలో ఉంటూ సుమారు 4వేల వరకు ప్రదర్శనలు ఇచ్చానన్నారు. తెలుగు వెలుగు నంది పురస్కారానికి ఎంపిక చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.

మద్ది ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఉపాలయంలో సోమవారం వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చక స్వాములు ఆలయ ముఖ మండపంపై ప్రత్యేక పూలతో అలంకరించిన వేదికపై భూసమేత వేంకటేశ్వర స్వామివార్లను ఆశీనులనుచేసి శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవాన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. కన్నుల పండుగగా నిర్వహించిన కల్యాణం అనంతరం ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. . స్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు, ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్‌వీ చందన తెలిపారు.

ఫీజు పోరును విజయవంతం చేయాలి



కొయ్యలగూడెంలో ఫీజు పోరు పోస్టర్స్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కొయ్యలగూడెం: కూటమి ప్రభుత్వ విద్యా విధానాలకు వ్యతిరేకంగా మార్చి 12వ తేదీ నిర్వహించే ఫీజు పోరు ధర్నాను విజయవంతం చేయాలంటూ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గొడ్డటి నాగేశ్వరరావు పిలుపు ఇచ్చారు. సోమవారం కొయ్యలగూడెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఫీజు పోరు ధర్నా పోస్టర్స్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ప్రతి గ్రామానికి ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్స్ పంపిణీ చేసి విద్యార్థులు వారి తల్లిదండ్రులు చైతన్యం కల్పించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సమయంలో విద్యార్థులందరికీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేశారని పేర్కొన్నారు. ఏలూరులో నిర్వహించే ధర్నా కార్యక్రమానికి హాజరు కావాలని ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సూకల రాము, సంకుకొండ, మారిశెట్టి శ్రీను, గంటా రమేష్, నారా రామకృష్ణ, ఎస్కే బాజీ తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి



తెల్లంవారిగూడెంలో అదనపు తరగతి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఓ

బుట్టాయగూడెం: అదనపు తరగతి భవనం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ కేతావత్ రాముల నాయక్ అధికారులను ఆదేశించారు. మండలంలోని తెల్లంవారిగూడెంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల వసతి గృహాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆ పాఠశాలల విద్యార్థుల సౌకర్యార్థం నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. విద్యార్థినులు మధ్యాహ్న భోజనం చేస్తుండగా పీఓ భోజనశాలకు వెళ్లి పరిశీలించారు. ఆహార పదార్థాలను రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఉపాధ్యాయులతో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షలకు సమయం తక్కువగా ఉన్నందున విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా కృషి చెయ్యాలని కోరారు. హెచ్‌ఎమ్ పి. వసుంధరమ్మ, వార్డెన్ ఎమ్. ఉదయశ్రీ, పీడీ సత్యవతి, గిరిజన సంక్షేమ సాఖ ఇంజనీరింగ్ డీఈ శ్రీనివాస్, ఏఈ సత్యనారాయణ పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ తీగల చోరీ

కొయ్యలగూడెం: పొంగుటూరు పంచాయతీ పరిధిలోని కన్నాయిగూడెంలో రైతుల వ్యవసాయ బోర్లకు చెందిన తీగలను దుండగులు ఆదివారం రాత్రి అపహరించుకుపోయారు. గ్రామ శివారు ప్రాంతాల్లో పది మందికి చెందిన రైతుల బోర్లకి ఉండే తీగలను అపహరించడంతో సుమారు వంద ఎకరాల్లో మొక్కజొన్న పైరుకు తీవ్ర నష్టం వాటిల్లిందని వారు వాపోయారు. సుమారు ఒక రైతుకు రూ.10 వేల నుంచి 15వేలు నష్టం వాటిలిందన్నారు. వేగి సత్యవతి, యాగంటి బాబు, ఎం.కృష్టారావు, ఎం.కృష్ణ తదితర రైతులు నష్టపోయిన వారిలో ఉన్నారు.

సారా తయారీ, విక్రయాలను అరికట్టండి



చింతలపూడిలో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ నాగ ప్రభుకుమార్



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

చింతలపూడి: నాటు సారా తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టాలని ఎక్సైజ్ ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమిషనర్ నాగప్రభుకుమార్ సిబ్బందిని ఆదేశించారు. చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీదారులతో పాటు సారా విక్రేతలపై, బెల్ట్ షాపులు నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారా తయారీదారులకు బెల్లం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో నవోదయ 2.0 అవగాహన సదస్సులను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి అశోక్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సారా తయారీ స్థావరాలపై దాడి

కామవరపుకోట: గుంటుపల్లిలో నాటు సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ప్రొహిషన్ ఎక్సైజ్ చింతలపూడి సీఐ పి.అశోక్ తెలిపారు. సోమవారం గ్రామంలో నాటు సారా స్థావరాలపై దాడులు నిర్వహించామన్నారు. సారా తయారీకి పనికి వచ్చే 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయడంతోపాటు 5 లీటర్ల సారాను స్వాధీన చేసుకున్నట్టు తెలిపారు. మేక నాగేశ్వరరావు, పరస కల్యాణంను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పురుషోత్తమరావు, కానిస్టేబుల్స్ దుర్గాప్రసాద్, సత్యనారాయణ పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

కుక్కునూరు: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సర్కిల్ అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ దాడుల్లో మండలంలోని ఇబ్రహీంపేట, రాజీవనగర్ గ్రామాల్లో 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై జి.వెంకటలక్ష్మి, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నాటు సారాతో వ్యక్తి అరెస్టు

కొయ్యలగూడెం: నాటు సారా కలిగి ఉన్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ సోమవారం పేర్కొన్నారు. దేవరపల్లి మండలం కృష్ణపాలానికి చెందిన కడలి శ్రీను మోటార్ బైక్‌పై యర్నగూడెం, కుంతలగూడెం రోడ్డులో పది లీటర్ల నాటు సారాను తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నారసింహుని కల్యాణోత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు



ఆలయ ఆవరణలో తాత్కాలిక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న చలువ పందిరి



ముస్తాబైన పల్లకి, ఉయ్యాల

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై ఈనెల 8 నుంచి 13 వరకు నిర్వహించనున్న లక్ష్మీనరసింహ స్వామి దివ్య కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. అందులో భాగంగా స్వామివారి పల్లకి వాహనాన్ని, ఉయ్యాలను ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, ప్రత్యేక తాత్కాలిక క్యూలైన్ల నిర్మాణం చేపట్టారు. ధ్వజ స్తంభాన్ని, ఆలయ పరిసరాలను మహిళలు శుభ్రం చేశారు. ఉత్సవ ఏర్పాట్ల పనులు మరో మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. 8వ తేదీన ఉదయం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెలుగా అలంకరించే వేడుకతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 10న ఉదయం కొండ కింద మండపంలో స్వామివారి కల్యాణం, 11న సాయంత్రం గ్రామోత్సవం, 12న చందనోత్సవం, పూర్ణాహుతి, 13న ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్ప యాగోత్సవ వేడుకలు నిర్వహిస్తామని ఆలయ ఇన్‌చార్జి ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు.

సరస్వతీదేవి ఆలయాల్లో వసంత పంచమి పూజలు



ప్రత్యేక అలంకరణలో జ్ఞాన సరస్వతి



కన్నాపురంలో పూజలు చేస్తున్న విద్యార్థులు

కొయ్యలగూడెం: వసంత పంచమి సందర్భంగా కొయ్యలగూడెం, కన్నాపురంలో అక్షరాభ్యాస, విద్యా పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కన్నాపురం రోడ్డులోని టెంపుల్స్ సెంటర్లో వాసవి మాతా ఆలయంలో కొలువైన సరస్వతీదేవి విగ్రహం వద్ద సామూహిక పూజలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కన్నాపురం మెయిన్ సెంటర్‌లో విజయలక్ష్మి కనకదుర్గ అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించి పూజలు చేశారు. కన్నాపురానికి చెందిన ఎంపీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు.

భక్తిశ్రద్ధలతో జ్ఞాన సరస్వతికి పూజలు

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెంలోని శ్రీహరిహరసుత అయ్యప్ప స్వామి దేవస్థానంలో ఉపాలయమైన జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో సోమవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి వేకువజాము నుంచి పంచామృత అభిషేకాలు, అర్చన కుంకుమ పూజ సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. కమిటీ సభ్యులు సెక్రటరీ నెక్కలపూడి సూర్యచంద్రరావు, చిన్ని వాసు స్వామి, కొల్లెపర కృష్ణారావు పాల్గొన్నారు. అయ్యప్ప చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు కేటాయించాలి



ద్వారకాతిరుమలలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నేతలు

ద్వారకాతిరుమల: ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు మూడు సెంట్లు చొప్పున స్థలాలు కేటాయించి, ఇల్లు కట్టుకోవడానికి తక్షణమే రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ మహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి గోలిమే బాల ఏసు మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలంలోని తిమ్మాపురం, కోడిగుడెం, రామసింగవరంలోని పేదలకు రాష్ట్ర ప్రభుత్వం హామీ ప్రకారం మూడు సెంట్లు ఇంటి స్థలం కేటాయించాలని, వికలాంగులకు, 50 ఏళ్ల వయస్సు నిండిన డప్పు కళాకారులకు పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ గ్రామ కార్యదర్శి యడ్లపల్లి రమేష్, పెండ్లి భూషణం, కొప్పుల రామకృష్ణ, పాకనాటి సుబ్బారావు, ఉండి మార్తమ్మ, పాకనాటి వెంకటేశ్వరరావు, నల్లటి దేవమాత, జాలాది సత్యవతి, యడ్లపల్లి లక్ష్మి, బయ్యారపు ఆనందరావు, నల్లటి పెద్దిరాజు, ఏపూరి పోతురాజు, జాలాది సుబ్బారావు పాల్గొన్నారు.